క్లుప్తంగా

తిరుపతమ్మ సన్నిధిలో భక్తజన సందడి



పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి అధికంగా ఉంది. సెలవు దినం కావడం, పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలి వచ్చారు. భక్త జన సందడితో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆంధ్ర నుంచే కాక తెలంగాణ నుంచి కూడా వందల సంఖ్యల వాహనాల్లో భక్తులు తరలి వచ్చారు.

కొనసాగుతున్న ప్రతిష్టా మహోత్సవాలు



నందిగామ: పట్టణంలోని కృష్ణ బలిజనగర్‌లో శివ నాగేంద్రస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం హోమాలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన ర్యాలీ



నందిగామ: కృష్ణ వెన్నెల మహిళా సొసైటీ ఆధ్వర్యాన నందిగామ పట్టణంలో ఆదివారం రాత్రి హెచ్‌ఐవీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక గాంధీ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులు వెలిగించి హెచ్‌ఐవీతో మరణించిన వారికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు ఎం.శీబా తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడ సెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీలోని శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆలయ వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి విశేషంగా కుంకుమ, పూజలు, శ్రీచక్రార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.

306 మందికి వైద్య పరీక్షలు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): ఎంజే నాయుడు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ వివేకానంద సెంటినరీ హైస్కూల్, విశ్వ జనీన ప్రార్థనా మందిరాల్లో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 306 మంది రోగులకు ఎంజే నాయుడు హాస్పటల్ వైద్య బృందం డాక్టర్లు రవితేజ, వంశీకృష్ణ, మణికుమార్, నాగేశ్వరరావులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎముకలు, కీళ్లు, నరాలు, కండరాల సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య సమస్యలకు మూలం వత్తిడే అని, దాన్ని అధిగమించి చక్కని ఆరోగ్యాన్ని ప్రతి ఒక్కరూ సొంతం చేసుకోవాలని ఎంజే నాయుడు సూపర్‌స్పెషాలిటీ ఫౌండేషన్ గౌరవ చైర్మన్ వావిలాల రజనీకాంత్ శర్మ సూచించారు. వివేకానంద సెంటినరీ హైస్కూల్ సెక్రటరీ, కరస్పాండెంట్ దుర్గాప్రసాద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీస్సులు

ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ వాహెద్ తన కుమార్తె నజ్మా వివాహం స్థానిక ఎంవీఆర్ కల్యాణ మండపంలో ఆదివారం వైభవంగా జరిపించారు. వివాహ వేడుకల్లో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యేలు వసంత కృష్ణప్రసాద్, వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ రుహుల్లా, విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు వధూవరులను ఆశీర్వదించారు.

సీఎం సహకారంతో పట్టణాభివృద్ధి

గడప గడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



నందిగామ 17వ వార్డులో గడప గడపలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు చెప్పారు. నందిగామలోని 17వ వార్డులో ఆదివారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డులోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి 'సంక్షేమ' క్యాలెండర్‌ను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా జరగని అభివృద్ధిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో చేసి చూపుతున్నారన్నారు. గత ప్రభుత్వాల పాలనలో కనీస మౌలిక వసతులకు నోచుకోక పట్టణ ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

నందిగామలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణ ప్రజలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు గుర్తు చేశారు. గడప గడపకు మన ప్రభుత్వంలో వచ్చిన ప్రతి సమస్యను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించనున్నట్లు తెలిపారు.

అండగా ఉండి ఆశీర్వదించాలి

మంచి చేయాలనే తపనతో పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా ఉండి ఆశీర్వదించాలని జగన్‌మోహనరావు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ జయరాం, కౌన్సిలర్ బాపట్ల సాంయ్య, వార్డు కన్వీనర్ పట్టా శ్రీను, నాయకులు తానూరి రాము, బండారు వెంకట్రావు, విశ్వనాథపల్లి కృపారావు, మేచర్ల విజయలక్ష్మి, పోతురాజు, బండారు శేషు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోండి



కథలు చదువుతున్న విద్యార్థులు



కంచికచర్ల గ్రంథాలయంలో విద్యార్థులకు కథలు చెబుతున్న ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు కనకారావు

పెనుగంచిప్రోలు: గ్రంథాలయాలను వినియోగించుకోవాలని అనిగండ్లపాడు, పెనుగంచిప్రోలు గ్రంథాలయాధికారులు ఇంజం మధు, మధుబాబు అన్నారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం బాలబాలికలకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. నీతి కథలు చదివించడం, పుస్తక పఠనంతో కలిగే లాభాలు వివరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, పాఠకులు పాల్గొన్నారు.

కంచికచర్ల: వేసవిలో విద్యార్థులు బయటకు వెళ్లకుండా ఉండటానికి ప్రభుత్వం గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తోందని శాఖా గ్రంథాలయ గ్రంథ పాలకుడు అల్లూరు రామచంద్రుడు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో రాష్ట్ర పౌర గ్రంథాలయశాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆదివారం విద్యార్థులకు పలు విభాగాల్లో ఆటలు నిర్వహించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయేల్ ముందుగా తెలుగు భాషపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం భవిత సెంటర్ ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు ఎం,కనకారావు విద్యార్థులకు కథలు నేర్పించారు. కవి నీలం సర్వేశ్వరరావు విద్యార్థులకు చిత్రలేఖనాన్ని నేర్పించారు.

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్-1 శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఉపాధ్యాయుడు వినోద్‌కుమార్ విద్యార్థులులకు ఇంగ్లిష్ గ్రామర్‌లో వెర్బ్ ఫారం నేర్పించారు. తర్వాత విద్యార్థులతో ఖోఖో తదితర ఆటలు ఆడించారు. గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, బీడీసీ మల్లిక, గ్రంథాలయ సిబ్బంది శ్యామల, సత్యావతి, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి.. నేడు స్పందన

కంచికచర్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని తహసీల్దార్ శంకరబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో సమస్యలుంటే వాటి పరిష్కారానికి ప్రజలు అర్జీలు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వచ్చిన అర్జీలను ప్రాధాన్యతాక్రమంలో త్వరితగతిన పరిష్కరిస్తారని తహసీల్దార్ పేర్కొన్నారు.

నందిగామ: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఆర్డీఓ రవీంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నందిగామలో ఈదురుగాలులు



ఈదురు గాలులకు రాఘవాపురం వెళ్లే రహదారిలో విరిగిపడ్డ చెట్టు

నందిగామ: నందిగామలో శనివారం రాత్రి ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. రాత్రి వేళ ఒక్కసారిగా వాతావరణం మారి ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. బలమైన ఈదురు గాలులు వీయడంతో పలుచోట్ల చెట్టు కొమ్మలు విరిగిపోయాయి. అదే సమయంలో మండలంలోని రాఘవాపురం వెళ్లే దారిలో ఓ వృక్షం విరిగి రోడ్డుపై పడిపోయింది. దీంతో ఆదివారం మధ్యాహ్నం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈదురుగాలులకు పలుచోట్ల విద్యుత్ లైన్లు తెగి పోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. రాత్రి వేళలో సైతం విద్యుత్ శాఖ సిబ్బంది శ్రమించి మరమ్మతులు నిర్వహించి తెల్లవారుజాముకు అన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



కళావేదికపై నృత్య ప్రదర్శన చేస్తున్న డ్యాన్స్ అకాడమీ నృత్యకారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన కళాక్షేత్రం డ్యాన్స్ అకాడమీకి చెందిన నృత్యకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై ఆదివారం సాయంత్రం నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో 22 మంది కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను అలరించింది. అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి

తిరుపతమ్మ ఆలయ ఈఓ రమేష్‌నాయుడు



పెనుగంచిప్రోలు: శ్రీ తిరుపతమ్మ ఆలయ అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు అన్నారు. ఆదివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ ఆలయం వద్ద, మునేరు అవతల మామిడి తోటల్లో సుమారుగా రూ.13.5 కోట్ల వ్యయ అంచనాతో కేశఖండనశాల, టాయిలెట్ బ్లాక్, డార్మెటరీ, షెడ్లు, గదుల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని, వాటిని ఐదారు నెలల్లో పూర్తి చేసి భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తామన్నారు. భక్తులను ఆకర్షించడానికి జాతీయ రహదారిపై ముండ్లపాడు క్రాస్‌రోడ్స్ దద్ద భక్తుల విరాళాలతో స్వాగత ద్వారం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. అక్కడ రెండు వైపులా వాహనాలు వెళ్లేందుకు డివైడర్ ఏర్పాటు చేస్తామన్నారు. దీనికి ఆర్‌అండ్‌బి అధికారుల అనుమతి కోరామని, వారు కూడా సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఆలయ సత్రాల గదుల్లో వసతులు సక్రమంగా లేవని, ఏసీ గదుల నిర్వహణ కూడా సక్రమంగా లేదని ఈఓ దృష్టికి తీసుకెళ్లగా ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడామని, కొద్ది రోజుల్లో వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. భక్తుల వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యమివ్వనున్నట్లు తెలిపారు.

గాన చరితుడు ఘంటసాల



గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

విజయవాడకల్చరల్: గాన చరితుడు ఘంటసాల వేంకటేశ్వరరావు అని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. తెలుగు కళావాహిని, పోలవరపు కోటేశ్వరరావు, సాహితీపీఠం, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై ఆదివారం ఘంటసాల శతజయంతి వేడుకలు, స్వరాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన చిట్టిబాబు మాట్లాడుతూ ఘంటసాల స్వరం అజరామరమని తెలుగు వారు ఉన్నంత వరకు ఆ స్వరం సజీవంగా ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఘంటసాల పేరుతో పోస్టల్ స్టాంప్‌ను ముద్రించిందని, పద్మశ్రీ పురస్కారం ప్రదానం చేసిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనతో శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారని తెలిపారు. వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు డేవిడ్ రాజు, వీరభద్రరావు, శింగంశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు. కృష్ణా, ప్రకాశం జిల్లాలనుంచి వచ్చిన గాయనీ గాయకులు తులసి, శ్రీదేవి, కృష్ణమోహన్, శేషగిరి, ఎస్‌కే బాబు, టి.నారాయణ ఘంటసాల స్వరపరచిన గీతాలు, భక్తి గీతాలు, దేశ భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమ ప్రారంభంలో ఘంటసాల చిత్రపటానికి గాయనీ గాయకులు పుష్పాంజలి ఘటించారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులతో మాట్లాడుతున్న చైర్మన్ రాంబాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దర్శనానికి విచ్చేసిన భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో దేవస్థానం కల్పిస్తున్న సౌకర్యాలను ఆదివారం ఆయన పరిశీలించారు. మహా మండపం రెండో అంతస్తులో భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదానం, అమ్మవారి దర్శనానికి భక్తులు వేచి ఉన్న క్యూలైన్లను పరిశీలించారు. దేవస్థానం కల్పిస్తున్న సదుపాయాలను భక్తులను అడిగి తెలుసుకున్నారు. అన్నప్రసాదం స్వీకరించేందుకు విచ్చేసిన భక్తుల పట్ల సిబ్బంది మర్యాద పూర్వకంగా వ్యవహరించడంతో పాటు వారికి సంతృప్తికరంగా అన్నప్రసాదం అందించాలని సూచించారు. క్యూలైన్లు కూలర్లు, ఫ్యాన్లు తిరుగుతున్నాయా లేదా అని పరిశీలించడంతో పాటు క్యూలైన్‌లో ఏర్పాటు చేసిన మంచినీటి సదుపాయంతో పాటు ఆలయ పరిసరాల్లో మరిన్ని చోట్ల భక్తులకు మంచినీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

నేడు సొసైటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

మైలవరం: మండలంలోని పుల్లూరు గ్రామం పీఏసీఎస్ భవన నిర్మాణానికి సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు శంకుస్థాపన కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జీ వెంకట్రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తన్నీరు నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. అనంతరం మొర్సుమల్లి సొసైటీ పరిధిలో గోదామును ప్రారంభిస్తారని తెలిపారు.

చలివేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి

మునిసిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు



చలివేంద్రాలను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో ప్రజల సౌకర్యార్థం పలు సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చలివేంద్రాలను ఏర్పాటుచేసి నిర్వహించడం అభినందనీయమని, వాటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మునిసిపల్ కమిషనర్ సీహెచ్ మల్లేశ్వరరావు అన్నారు. ఆదివారం పురపాలక సంఘ పరిధిలో పలు కూడళ్లలో వివిధ సేవా సంస్థలు ఏర్పాటుచేసిన చలివేంద్రాలను మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సదరు చలివేంద్రాల వద్దకు నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుండటంతో ఆ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిందిగా శానిటరీ కార్యదర్శులకు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు సూచించారు. చలివేంద్రాలకు అవసరమైతే పురపాలక సంఘం నుంచి తాగునీరు సరఫరా చేస్తామని, అందుకు మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీరు లేదా, మున్సిపల్ కమిషనర్‌కు తెలియస్తే వెంటనే నీరు సరఫరా చేస్తామని తెలిపారు. వేసవి తీవ్రత అధికంగా ఉండటంతో సేవా సంస్థల వారు చలివేంద్రాలను పనిచేసే వేళలను సాయంత్రానికి పెంచాలని కోరారు. పట్టణంలోని అన్ని వ్యాపార సంస్థల వారు తమ షాపుల వద్ద ప్రజలు అందుబాటులో తాగునీరు ఉంచి పురపాలక సంఘానికి సహకరించాలని తెలిపారు.

తాగునీటి సమస్య ఉంటే సమాచారం ఇవ్వండి

మున్సిపాలిటీ సరఫరా చేసే తాగునీరు సక్రమంగా అందని ప్రాంతాల వారు ఆయా సచివాలయాల ఎమినిటీస్ కార్యదర్శులకు తెలియజేయాలని కమిషనర్ తెలిపారు. వెంటనే మున్సిపాలిటీ నుంచి ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేస్తామని తెలిపారు.

సమస్య సత్వర పరిష్కారానికి కాల్ సెంటర్లు

పురపాలక సంఘంలో తాగునీటి సమస్య సత్వర పరిష్కారానికి కాల్ సెంటర్లను ఏర్పాటుచేసినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. వారి ఫోన్ నెంబర్లను చెప్పారు. కె.వెంకటేశ్వరరావు 9949932038, ఏఈ హనుమంతరావు 9849906575,డీఈఈ శివకోటేశ్వరరావు 9849907979, మున్సిపల్ కమిషనర్ 9849905823 నెంబర్లకు చేయొచ్చని కమిషనర్ పేర్కొన్నారు.

కుమ్మరి వాగు డొంక రోడ్డు అభివృద్ధి

- రూ.2 లక్షలతో పనులు
- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



డొంక రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలంలోని కాండ్రపాడులో మండల పరిషత్ నిధులు రూ. రెండు లక్షలతో చేపట్టిన కుమ్మరి వాగు డొంక రోడ్డు పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. జగన్‌మోహనరావు మాట్లాడుతూ కాండ్రపాడు కోనాయపాలెం గ్రామాల మధ్య ఉన్న కుమ్మరి వాగు డొంక రోడ్డు ధ్వంసమవడంతో పంట పొలాలకు వెళ్లడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారని రైతులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. రైతులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకునేందుకు డొంక రోడ్డును పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో రైతు సంక్షేమ ప్రభుత్వ పాలన సాగుతోందని జగన్‌మోహనరావు కొనియాడారు. త్వరలోనే రోడ్డు అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, నాయకులు కొండా కృష్ణారెడ్డి, గుగులోతు లక్ష్మి, కమతం నర్సిరెడ్డి, వైఎస్ఎన్ ప్రసాద్, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అన్న సంతర్పణ సమితి సేవలు అభినందనీయం



చిన్నారికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఇంతియాజ్ అహ్మద్ తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అన్న సంతర్పణ సమితి సేవలు అభినందనీయమని ఏపీ మైనార్టీ సంక్షేమశాఖ స్పెషల్ సెక్రటరీ ఇంతియాజ్ అహ్మద్ అన్నారు. అన్న సంతర్పణ సమితి ట్రస్ట్ ద్వితీయ వార్షికోత్సవాన్ని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ.. పేదలకు అన్నదానం మహాదానమన్నారు. సమాజంలో ఆకలిగా ఉన్న పేదవారికి అన్నదానం చేయటం అద్భుతమైన కార్యక్రమమని కొనియాడారు. ప్రతి రోజూ అన్నదానం చేయటం సామాన్యమైన విషయం కాదన్నారు. ఆకలిగా ఉన్న వ్యక్తులు ఎక్కడ ఉంటారో అక్కడకు వెళ్లి ప్రత్యేకంగా ఆహారాన్ని అందించటం వెనుక చాలా కృషి ఉందన్నారు. తాను ఈ జిల్లా కలెక్టర్‌గా ఉన్న సమయంలోనూ మంచి సేవలందించిందని గుర్తు చేశారు.

మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలి..

చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు మాట్లాడుతూ అన్న సంతర్పణ సమితి కార్యవర్గం అపూర్వమైన సేవలందిస్తుందన్నారు. నిత్యం అన్నదానం చేయటం వెనుక చాలా కష్టముంటుందన్నారు. ఎన్ని ఇబ్బందులెదురైనా అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగించటం అభినందనీయమన్నారు. సీ చానల్ ఎండీ రమేష్ మాట్లాడుతూ నగరంలో పేదలకు అండగా ఉండే విధంగా అన్న సంతర్పణ సమితి కమిటీ వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించటం ఆనందంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో ముందు మరిన్ని కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా చిన్నారులకు నిర్వహించిన వివిధ శిక్షణా కార్యక్రమాల ముగింపును పురస్కరించుకొని అతిథుల చేతుల మీదుగా వారికి ప్రశంసాపత్రాలను, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో విజయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ చైర్మన్ తట్టి అర్జునరావు తదితరులు ప్రసంగించారు. శ్రీ వాసవీ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి గొంట్లా మోహనరావు సభను నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు జి.దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించటం ప్రతి ఒక్కరి బాధ్యత



వృద్ధులకు సరుకులు పంపిణీ చేస్తున్న ఏసీపీ భాస్కరరావు, ట్రస్ట్ సభ్యులు, దాతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వృద్ధులను ఆదరించటం ప్రతి ఒక్కరి బాధ్యత అని సెంట్రల్ జోన్ ఏసీపీ బి.భాస్కరరావు అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన దాత కాంతీలాల్ జైన్, మదన్‌లాల్ జైన్ సహకారంతో వయోవృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ.. 70 ఏళ్లు దాటిన వయోవృద్ధులకు ప్రతి నెలా నిత్యావసర సరుకులతో పాటు ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు అందజేయటం అభినందనీయమన్నారు. 191 నెలలుగా వయోవృద్ధులకు సేవలు అందించటం సామాన్యమైన విషయం కాదన్నారు. ట్రస్ట్‌కు అవసరమైన సహాయ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. 53వ డివిజన్ కార్పొరేటర్ మహదేవ్ అప్పాజీరావు మాట్లాడుతూ.. ఇంత మంచి సేవా కార్యక్రమంలో తాను పాల్గొనే అవకాశం లభించటం ఆనందంగా ఉందన్నారు. వృద్ధులకు ప్రతి ఆదివారం ప్రముఖ ఆయుర్వేదం, అల్లోపతి, హోమియో వైద్యనిపుణులచే ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేయటం అభినందనీయమన్నారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ మాట్లాడుతూ తాము చేస్తున్న సేవలకు దాతలు ట్రస్ట్ సభ్యులు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. అనంతరం దాతలను సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్టీ తట్టి అర్జునరావు, పి.రూపవతి, కె మధుసూదనరావు, వెంకటేష్ గోదావరి పాల్గొన్నారు.

గోశాల నిర్మాణానికి రూ.25వేల వితరణ

నెమలి(గంపలగూడెం): నెమలి శ్రీవేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో గోశాల నిర్మాణానికి ఒక భక్తురాలు ఆదివారం రూ.25వేలు వితరణగా ఇచ్చారు. నందిగామకు చెందిన తాళ్లూరి మణివర్ధినికి ఆలయ కమిటీ చైర్మన్ కే శశిరేఖకు అందజేశారు. దాతను ఆలయ ప్రధాన అర్చకులు ఆశీర్వదించి ప్రసాదం అందజేశారు.

నీటి సమస్య పరిష్కరిస్తాం



నీటిని పరిశీలిస్తున్న మునిసిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్

జగ్గయ్యపేట అర్బన్: తాగునీటి సమస్య పరిష్కరిస్తామని మునిసిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ చెప్పారు. పట్టణంలోని 25వవార్డు క్రిస్టియన్‌పేటలో కొన్ని ప్రాంతాల్లో మునిసిపాలిటీ కుళాయిల ద్వారా సరఫరా అయ్యే తాగునీరు మురికిగా, దుర్వాసన వస్తోంది. దీంతో స్థానిక మహిళలు ఆదివారం మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన పంపులు వచ్చే సమయానికి వెళ్లి నీటిని స్వయంగా పరిశీలించారు. నీరు మురికిగా రావడం, వాసన వస్తుండటంతో ఆయన వెంటనే మున్సిపల్ కమిషనర్ సీహెచ్‌మల్లేశ్వరరావు, ఏఈ హనుమంతరావుకు ఫోన్ ద్వారా తెలిపారు. సోమవారం సమస్యను గుర్తించి వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.